# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ' ఉభయ తెలుగు రాష్ట్రాలో 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించారు.**

2. **తెలంగాణను ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **రానున్న మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా ఉభయ 'తెలుగు రాష్ట్రాల్లో నిన్న రాత్రి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలుచోట్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇళ్ల వద్ద దీపాలు వెలిగించారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి, విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొనగా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ,

వాయిస్ 25 సెకన్లు

అలాగే తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, రామ్‌నాథ్ ఠాకుర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు కలిసి ఆశీర్వాద దీపాలను వెలిగించారు అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త భారతదేశాన్ని నిర్మిస్తున్న విశ్వకర్మ అని అభివర్ణించారు. అలాగే హైదరాబాద్ లోని కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించిన 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు.

--------------------------

తెలంగాణను ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో యునైటెడ్ కింగ్డమ్ బిజినెస్ స్కూల్స్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో హైదరాబాద్‌లోని ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు.

---------------------------

రానున్న మూడేళ్లలో 35 వేల కోట్ల రూపాయలతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు పనులను మంత్రి నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ డ్యామ్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

వ్యవసాయ ప్రగతిలో విత్తనాలదే కీలక పాత్ర, అని విత్తనాలపై నిరంతరం పరిశోధనలు జరగాలని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్–ఆఫ్రికా విత్తన సదస్సు–2026కు గవర్నర్ నిన్న ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎల్‌నినో వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని అధిక దిగుబడులు ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. విత్తన పరిశోధన, ఉత్పత్తి, పరీక్ష, ధ్రువీకరణ రంగాల్లో తెలంగాణ మరింత పురోగతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఆహార భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం భారత్, ఆఫ్రికా దేశాల మధ్య భాగస్వామ్యాలను మరింత పెంచుకోవాలని సూచించారు.

---------------------------

ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రకాశం జిల్లా అద్దంకిలో నిర్మించిన సెమీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం, అగ్నిమాపక కేంద్రాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఆమె నిన్న ప్రారంభించారు. అనంతరం అనిత మాట్లాడుతూ,..

వాయిస్ 24 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పార్టీ ముఖ్య నాయకులతో దృశ్య మాధ్యమం విధానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, ఖరీఫ్ ప్రారంభం నుంచి ఈ నెల 16 వ తేదీ వరకు 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ముందే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రైతులకు రావాల్సిన మూడు వేల కోట్ల రూపాయల పంటల బీమా పరిహారాన్ని వెంటనే చెల్లించాలని జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.

---------------------------

తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిన్న రాత్రి మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యపుపందిరి వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. దీనిపై మా ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ 27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక సాధికారత, జీవనోపాధి అవకాశాల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలో సెర్ప్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి నిన్న మాట్లాడుతూ, ప్రతి స్వయం సహాయక సంఘాల మహిళకు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా బీమా రక్షణ కల్పించాలని సూచించారు. సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయానికి స్వయం బ్రాండ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మహిళలు, చేతివృత్తిదారులకు వివిధ వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

దక్షిణ అంతర్గత కర్ణాటక నుండి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న అల్పపీడన ద్రోణి సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న మూడురోజుల రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================